ప్రజాశక్తి

గురువారం 29 డిసెంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నేడు విశాఖకు కార్మిక చైతన్య జాతా

జివిఎంసి వద్ద బహిరంగ సభ

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై ప్రజా ఉద్యమం, హక్కుల రక్షణకు కదలనున్న కార్మికులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సకల కార్మికుల హక్కుల రక్షణ కోసం, విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించే దిశగా విశాఖ కార్మికవర్గం కదులుతోంది. ఈ నెల 22, 23 తేదీల్లో నగరంలోని డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిఐటియు 12వ మహాసభలు జరిగిన విషయం తెలిసిందే. ఈ మహాసభల్లో పాల్గొన్న కార్మికులంతా రంగాల వారీగా అన్ని రకాల కార్మిక హక్కులనూ కాలరాస్తున్న కేంద్రంలోని బిజెపి విధానాలపై పోరాడాలని రెండు రోజుల మహాసభల్లో పలు తీర్మానాలు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం బిజెపి మినహా అన్ని పార్టీలను, అఖిలపక్ష కార్మిక సంఘాలతో నిర్వహించిన ఐక్య కార్యాచరణ ఫలితంగా కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికి ముందుకడుగు వేయలేకపోతుందని, ఇంకా అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారా పూర్తిగా ప్రయివేటీకరణ నుంచి ప్లాంట్‌ను కాపాడుకోవాలని మహాసభ పిలుపునిచ్చింది. సిఐటియు రాష్ట్ర 16వ మహాసభలు 2023 జనవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రంలోని భీమవరంలో జరుగనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 3 కార్మిక చైతన్య యాత్రలు జరుగుతున్నాయి. దీంట్లో భాగంగా ఉత్తరాంధ్ర కార్మిక చైతన్య జాతా శ్రీకాకుళం జిల్లా నుంచి విశాఖకు గురువారం ఉదయం రానుంది. తగరపువలస నుంచి వివిధ జంక్షన్లలో కార్మికులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకనున్నారు. జివిఎంసి గాంధీ బొమ్మ వద్దకు చేరుకున్నాక మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ జరుగనుంది. ఈ జాతాకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు నాయకత్వం వహిస్తున్నారు. మరో రెండు జాతాల్లో ఒకటి హిందూపురం, మరొకటి కుప్పం నుంచి కార్మిక, చైతన్య జాతాలు జరుగుతున్నాయి.

జాతాను జయప్రదం చేయాలి : కుమార్

కలెక్టరేట్ : గురువారం తగరపువలస నుంచి జివియంసి గాంధీ విగ్రహం వరకు సాగే ఈ జాతాకు, జివియంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్మిక వర్గం తరలిరావాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ విజ్ఞప్తి చేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టులు, రైల్వే, రక్షణ రంగాల అమ్మకాన్ని ఆపాలని, కార్మికులందరికీ కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని, కార్మికులకు నష్టం చేసే లేబరు కోడ్స్‌ను రద్దు చేయాలని, బోనస్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ చెల్లించాలని, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, భవన నిర్మాణం, ఆటో, ముఠా, ట్రాన్స్‌పోర్టు, తోపుడబండ్లు కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను అరికట్టాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, గిగ్ వర్కర్స్‌కు కేరళ తరహా గూగుల్ యాప్ ఏర్పాటుచేసి 8 శాతం లోపు కమిషన్ తీసుకోవాలని తదితక కార్మిక వర్గ సమస్యలపై కార్మికులను చైతన్యం చేయడానికి, భవిష్యత్తు పోరాటాలకు కార్మికులను సిద్ధం చేయడానికి ఈ జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విఒఎల రాష్ట్ర మహాసభకు ఏర్పాట్లు పూర్తి

నేడు కల్యాణ వేదిక వద్ద సభ

హాజరుకానున్న నర్సింగరావు, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



మహాసభ వేదిక...

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర నాలుగో మహాసభకు అనకాపల్లిలోని గవరపాలెంలో వివి.రమణ రైతు భారతి కల్యాణ వేదిక సిద్ధమైంది. గురు, శుక్రవారాల్లో జరగనున్న ఈ మహాసభకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. గురువారం ఉదయం 10 గంటలకు కల్యాణ వేదిక వద్ద సభ జరగనుంది. ఈ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, విఒఎల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె.ధనలక్ష్మి ప్రసంగించనున్నారు. రాష్ట్రంలో 28,500 మంది విఒఎలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘం మహాసభ అనకాపల్లిలో జరగడం ఇదే తొలిసారి. ఈ మహాసభలో రాష్ట్ర నలుమూల నుంచి హాజరైన ప్రతినిధులు సాధించుకున్న విజయాలు, పోరాట అనుభవాలు పంచుకోనున్నారు. గత మహాసభ నుంచి ఈ మహాసభ కాలంలో విఒఎల పట్ల ప్రభుత్వాలు అనుసరించిన వైఖరి, నిర్బంధం, ప్రతిఘటనపై మహాసభ చర్చించనుంది. విఒఎలు ఐక్య పోరాటాలతో ప్రభుత్వ విధానపరమైన దాడులను తిప్పికొట్టారు. గ్రేడింగ్ విధానంతో విఒఎల వేతనాల్లో కోత పెట్టేందుకు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. చివరకు గ్రేడింగ్ కాలంలో కోతపెట్టిన వేతనాలు ప్రభుత్వం చెల్లించేలా పోరాడారు. పదో తరగతి విద్యార్హత, 40 ఏళ్లు నిండిన వారిని తొలగించాలని, పురుషులను తప్పించాలని చేస్తున్న ప్రయత్నాలన్నింటినీ ప్రతిఘటిస్తూ వస్తున్నారు. సంఘ కార్యక్రమాలను సమీక్షించి, భవిష్యత్తు కర్తవ్యాలను మహాసభ రూపొందించనుంది.

మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

▶ వార్త 3లో..

కొత్త ఐటి పాలసీ : అమర్‌నాథ్

▶ వార్త 8లో..

భూములు దోచుకోవడానికి డ్రోన్ సర్వే

▶ వార్త 8లో..

కెజిహెచ్‌కు ఐఎస్‌ఒ 9001-2015



ఐఎస్‌ఒ ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న కెజిహెచ్ సూపరింటెండెంట్ మైథిలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రధాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌కు ఐఎస్ఒ ధ్రువీకరణ పత్రం లభించింది. ఈ ధ్రువపత్రాన్ని కెజిహెచ్ డాక్టర్ మైథిలికి గురువారం హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికెషన్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య, ఎఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు అందజేశారు. జనరల్ మెడిసిన్ విభాగానికి ప్రత్యేకంగా హైజిన్ ప్రాక్టీస్ ఐఎస్ఒ ధ్రువీకరణ పత్రాన్ని ఆ విభాగం హెచ్ఒడి డాక్టర్ సుందర్ రాజుకు అందజేశారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఇటీవల ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కెజిహెచ్‌లో అన్ని విభాగాలను సందర్శించి ఆడిట్ నిర్వహించారు. ఈ సంస్థ క్వాలిటీ ఎసూరెన్స్, క్వాలిటీ మేనేజ్మెంట్ అంశాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించింది. ఆయా విభాగాలు రికార్డుల నిర్వహణ, సైన్ బోర్డ్స్, వార్డులలో వైద్య సిబ్బంది జవాబుదారీతనం, ఐసియులో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, చికిత్సకు సంబంధించి అనుసరిస్తున్న వివిధ అంశాలను తనిఖీచేశారు. వీటన్నింటినీ సక్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని 9001-2015 ఐఎస్ఒ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ ఎడి చిట్టూరి శ్రీనివాసకుమార్, సిఎస్ ఆర్ఎమ్ఒ డాక్టర్ వాసుదేవ్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు చెక్కును అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులు

జివిఎంసికి స్టీల్‌ప్లాంట్ ఆస్తి పన్ను చెల్లింపు

ప్రజాశక్తి-విశాఖపట్నం : వైజాగ్ స్టీల్ ప్లాంట్ చెల్లించాల్సిన ఆస్తి పన్ను రూ.3,41,47,156 చెక్కును ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం జోనల్ కమిషనర్ ద్వారా జివిఎంసి కమిషనర్ రాజాబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థలు ఆస్తి పన్నుల బకాయిలను జివిఎంసి కి స్వచ్ఛందంగా చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, చట్ట ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, వైద్య సౌకర్యం కల్పించాలని, మందులు ఇవ్వాలని, మట్టిఖర్చుల నిమిత్తం రూ.25వేలు ఇవ్వాలని, విరమణ బకాయిలు వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ ఎపిఎస్ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ, 2017 పేస్కేల్ ఎరియర్స్ చెల్లింపులలో గ్రాట్యూటీ చట్టానికి భిన్నంగా యాజమాన్యం లెక్కలు తయారుచేసి 36 నుంచి 39 సంవత్సరాలు సర్వీసు చేసిన ఉద్యోగులకు లక్షలాది రూపాయలు కోత విధించిందని తెలిపారు. కోత విధించిన మొత్తాలను గ్రాట్యుటీ చట్టం ప్రకారం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి సంవత్సరాలు గడుస్తున్నా పిఎఫ్ సెటిల్మెంట్లు చేయడంలేదన్నారు. అన్ని రోగాలకూ మందులు ఆర్‌టిసి ఆసుపత్రి ద్వారా సమకూర్చాలని కోరారు. 2020, 2021 సంవత్సరాలలో ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాట్యూటీ, పిఎఫ్, ఇతర సెటిల్మెంట్లు ఇంతవరకు చేయలేదన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

వ్యాపారస్తులు
ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి పరిధిలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలని, నూతన వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని సూచించారు.

వికలాంగుల పెన్షన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రద్దుచేసిన వికలాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు వై.డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. పోరాట సమితి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన రెండవ రోజైన బుధవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికలాంగుల కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, పొరుగు సేవల ఉద్యోగులు ఉన్నారని, ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నాయని చెప్పి మూడు నెలల క్రితం ఉన్న పెన్షన్లను నిలిపివేయడం అన్యాయం అన్నారు. ఏ కుటుంబంలోనూ వికలాంగులను కుటుంబ సభ్యులు ఆదరించి చూసే పరిస్థితి లేదన్నారు. ఈ స్థితిలో ప్రభుత్వం ప్రతినెలా ఇస్తున్న రూ.3 వేలు పెన్షన్ వల్ల ఆత్మ గౌరవంతో వికలాంగులు జీవనం సాగిస్తున్నారని చెప్పారు. 18 సంవత్సరాల నిండిన వికలాంగులకు ప్రత్యేక వ్యక్తిగత రేషన్ కార్డు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని, 2016 నాటి వికలాంగుల చట్టం అమలు చేయాలని, కల్యాణమస్తు పథకంలో 10వ తరగతి అర్హతను మినహాయించాలని డిమాండ్‌చేశారు. ఈ నెల 30న చలో కలెక్టరేట్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారేడిపూడి రమేష్ బాబు, ఎస్.మల్లీశ్వరి, గరికిన చంద్రశేఖర్, పులిగి శ్రీనివాస, కానూరు శంకరరావు పాల్గొన్నారు.

క్వీన్ మేరీలో ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి 39వ వార్డులోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 228 మంది విద్యార్థులకు ఉచితంగా బై జూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో 3900 ట్యాబ్‌లును అందించినట్టు చెప్పారు. అనంతరం నాడు నేడు పనులపై ఆరా తీస్తూ నిలిచి పోయిన అదనపు తరగతి గదుల వనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సైన్స్ ఫెయిర్‌లో స్కూల్ పిల్లలను రాష్ట్ర స్థాయిలో గెలుపొందేలా ప్రోత్సహించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వివిధ కార్పొరేషన్ల స్టేట్ డైరెక్టర్లు సబిరా బేగం, సనవల రవీంద్ర భరత్, వైసిపి నాయకులు మంజేబ్ ఖాన్, స్కూల్ చైర్మన్ సత్యవతి, వైస్ చైర్మన్ దుర్గ, తాతారావు, బాబి, ఇబ్రహీం, సలీం, కమలుద్దీన్, రమణమ్మ, మాధురి, శివ, అయాజ్ పాల్గొన్నారు.

సమన్వయంతో అట్రాసిటీ కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలని, కేసుల పరిష్కారానికి రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ యాక్ట్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, పెండింగుకు గల కారణాలను పోలీస్ అధికారులతో చర్చించారు.

డ్వాక్రా బజార్‌కు ఆదరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పోలమాంబ అమ్మవారి గుడి వెనుక మైదానంలో నిర్వహిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజారుకు ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోందని, మొదటి రోజు అమ్మకం రూ.6,58,000గా ఉందని నిర్వాహకులు తెలిపారు. స్వయం సహాయ బృందాల సభ్యులు తయారుచేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9.30 గంటల వరకు విక్రయాలు నిర్వహిస్తున్నారు.

ఉపాధి లేని మత్స్యకారులకు సహకారం

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖ కంటైనర్ టెర్మినల్ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు 2002 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం 543 కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున మొత్తం 1,35,75,000 చెల్లింపులు జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. విశాఖ కంటైనర్ టెర్మినల్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన మత్స్యకారులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో అందరు మత్స్యకార సంఘాలతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ముఖ్యమంత్రి రక్షించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయవద్దని మోడీ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 636వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు సందర్భాలలో ఢిల్లీ వెళ్తున్నారని, ఆ సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేయవద్దని ప్రధాని మోడీ వద్ద ప్రస్తావిస్తున్న పరిస్థితి ఉండటం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాల ప్రతినిధులను కేంద్ర వద్దకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు కార్మిక, ప్రజా సంఘాల నిర్వహిస్తున్న పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్.కృష్ణ, కె.సత్యనారాయణ, దేవర అప్పలరాజు, పాత్రబోయిన చినఅప్పారావు, ఇల్లిపిల్లి అప్పారావు, పడాల పైడిబాబు, పెద్దాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న టిఎన్‌టియుసి నాయకులు

సెవెన్ హిల్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : నగరంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో అరుదైన, సంక్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను హాస్పిటల్ కన్సల్టెంట్, ప్లాస్టిక్ కాస్మోటిక్ సర్జన్ హెచ్‌ఒడి డాక్టర్ అంజలి సాప్లే బుధవారం మీడియాకు వివరించారు. ఎపిఎస్ఇబిలో లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్న రెహమాన్ (38) ఏడాది క్రితం ట్రాన్స్ ఫార్మర్‌లో పనిచేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అతని కుడి చేయి మోచేతి కింద తెగిపోయి, ఎడమచేతి బొటనవేలు, చూపుడువేలు కోల్పోయాడు. కుడి చేతికి కృత్రిమ చెయ్యి అమర్చారు. అయితే కార్యకలాపాలకు భార్యపై ఆధారపడే పరిస్థితి ఉండటంతో సెవెన్ హిల్స్ ఆసుపత్రికి వచ్చి డాక్టర్ అంజలి సాప్లేను సంప్రదించారు. ఆమె అతనికి అరుదైన, సంక్లిష్టమైన ప్లాస్టిక్ సర్జరీ చేశారు. కొత్త బొటనవేలు అమర్చారు. అతని కుడి పాదం యొక్క రెండవ బొటనవేలును ఎడమ చేతికి అమర్చారు. కొత్త బొటన వేలు ద్వారా మంచిగా రక్తప్రసరణ జరగడానికి శస్త్ర చికిత్స చేశారు. మైక్రోస్కోప్‌లో 11 గంటల పాటు శ్రమించి నిర్వహించిన చికిత్స విజయవంతమైంది. డాక్టర్ అంజలి సాప్లేతో పాటు డాక్టర్ సుమిత్ర గంటా మెట్ల, డాక్టర్ కుచేలబాబు బృందం ఈ చికిత్స అందించారని డాక్టర్ అంజలి సాప్లే తెలిపారు. డాక్టర్ల బృదాన్ని సిఇఒ, వింగ్ కమాండర్ ఎంకె బోస్ అభినందించారు.

ఘనంగా ద్రోణంరాజు వర్ధంతి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారాయణ 17వ వర్ధంతి సందర్భంగా సిరిపురం జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి ద్రోణంరాజు శ్రీవాత్సవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎందరో రాజకీయ నాయకులను తయారుచేసిన ఘనత ద్రోణంరాజు సత్యనారాయణకే దక్కుతుందని వచ్చినవారంతా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎయు మాజీ రెక్టార్ ప్రసన్నకుమార్, వుడా మాజీ చైర్మన్ పిఎస్ఎన్.రాజు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు కోలా గురువులు, జాన్ వెస్లీ, వడ్డాది మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



ద్రోణంరాజు విగ్రహం వద్ద నివాళి...

తిట్ల దండకం బాధ్యత కలెక్టర్లకా? : బివి.రామ్



మాట్లాడుతున్న బివి.రామ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే కలెక్టర్లు ప్రెస్ మీట్ పెట్టి తిట్టాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశించడం దుర్మార్గం అని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే, మంత్రులు, ఎమ్మెల్యేలతో తిట్టించిన ముఖ్యమంత్రి ఇకనుంచి తిట్ల దండకం బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారని ఎద్దేవా చేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చే పెన్షన్ల లో నూటికి 30 శాతం వరకు కోత విధిస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే తిట్టే కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. కలెక్టర్ల వ్యవస్థను దుర్వినియోగపరిచే ప్రయత్నం దుర్మార్గమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇక్కట్లను వివరిస్తూ "దండయాత్ర'! పేరిట తాను విడుదల చేసిన ఆడియో సాంగ్‌కు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికలలో 175కి 175 స్థానాల్లోనూ వైసిపి ఓటమి చెందడం ఖాయమని జోస్యం చెప్పారు. మీడియా సమావేశంలో టిడిపి నాయకులు బోడేపూడి దొరబాబు, దువ్వి పరమేశ్వరరావు, దబ్బాడ వెంకటరమణ పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన మహిళా పోలీసులకు అభినందనలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : 71వ అల్ ఇండియా పోలీస్ వాలీ బాల్ క్లస్టర్-2022లో బంగారు పతకాలు సాధించిన నగర మహిళా పోలీసులను పోలీసు కమిషనర్ శ్రీకాంత్ అభినందించారు. విశాఖపట్నం నగర పరిధిలోని ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ టి.చిన్నారి (మల్కాపురం) ఎం. వరలక్ష్మి (గోపాలపట్నం), ఎన్.భవాని (ద్వారకా(క్రైమ్)) పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగిన 71వ అల్ ఇండియా పోలీస్ వాలీబాల్ క్లస్టర్ 2022లో యోగా విభాగంలో 36 నుంచి 55 సంవత్సారాల విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించారు. వీరిని నగర పోలీసు కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు

అయిందనిపించారు...

- మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండల సర్వసభ్య సమావేశం మరోమారు అయిందనిపించారు. ఎంపిపి ఎం.నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎజెండా ప్రకారం శాఖల వారీగాసంబంధిత అధికారులు నివేదికను వినిపించారు. అధికార వైసిపి సభ్యులు ప్రశ్నించే పరిస్థితి లేకపోగా, మండలంలో ప్రధాన ప్రతిపక్షం టిడిపికి ఉన్న ఒక ఎంపిటిసి, ముగ్గురు సర్పంచ్‌లు మరోమారు గైర్హాజరుతో సమస్యలపై ప్రశ్నించే నాధులుగానీ,చర్చగానీ జరిగే పరిస్థితి లేకుండా పోయింది. టిడిపి హయాంలో విద్యుత్ బిల్లుల సమస్యల వల్ల ఇపుడు వృద్ధులు పెన్షన్లు కోల్పోయే పరిస్థితి ఉందని జెడ్‌పిటిసి ఆరోపించారు. వచ్చే ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా ఆమోదించారు. సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంపిపి నాగమణి మొక్కుబడిగా చెప్పడంతో మండలసభ అయిందనిపించారు.

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : 25వ వార్డు సీతంపేటలోని గణేష్‌నగర్, పార్వతీశ్వరాలయం పక్క వీధిలో రూ.8 లక్షలతో బిటి రోడ్డు పనులకు వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ బుధవారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ఎఇ శ్రీరామ్మూర్తి, కాంట్రాక్టర్ పివివి.నాగరాజు, పోతిబంతి హరికృష్ణ, సారిపిల్లి రాజు, కుమార్, సన్నీ, దాసు, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, కార్య కర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ద్రోణంరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: రాజకీయ విలువలకు చిరునామాగా ఉన్న ద్రోణంరాజు సత్యనారాయణ, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారికి ఆదర్శనీయుడని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు అన్నారు. బుధవారం బాలయ్య శాస్త్రి లేఅవుట్ సింధూర ఫంక్షన్ హాల్‌లో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ద్రోణంరాజు 17వ వర్ధంతి నిర్వహించారు. కెకె.రాజుతోపాటు వుడా మాజీ చైర్మన్ రవి, ద్రోణంరాజు శ్రీవత్స, పత్రికా సంపాదకులు వివి రమణమూర్తి తదితరులు ద్రోణంరాజు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ద్రోణంరాజు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, సీనియర్ నాయకులు పేడాడ రమణకుమారి, జబర్దస్త్ అప్పారావు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను ట్రస్ట్‌బోర్డు సభ్యులు బుధవారం పరిశీలించారు. క్యూలైన్లు, టెంట్లను పరిశీలించారు. సామాన్య భక్తుల దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. భక్తులకు పొంగలి అందించను న్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, ఎస్ శ్రీదేవి, ఇఇ శ్రీనివాసరాజు. అర్చకులు కరి సీతారామాచార్యులు పాల్గొన్నారు

క్షతగాత్రునికి పరామర్శ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస సప్తగిరి థియేటర్ సమీపంలో ఈ నెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్న కొత్తపేటకు చెందిన భవిరి శెట్టి రాంబాబునుటిడిపి నగర కార్యదర్శి పిట్టా సురేష్ బుధవారం పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

హాకీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -కంచరపాలెం :ఉత్తర నియోజకవర్గం కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో డాల్ఫిన్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో 12వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాయ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హాకీ ఛాంపియన్ షిప్ పోటీలను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, అంబటి శైలేష్, అప్పారావు, కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ద్వారకా సిఐ కెఎన్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం సాగరతీరం, రహదారుల్లో ఇరువైపులా చెట్లకు, డివైడర్లకు, విద్యుత్ స్తంభాలకు రేడియం స్టిక్కర్లను ట్రాఫిక్ పోలీసులు అతికించారు. జివిఎంసి హార్టీకల్చర్ విభాగం సహకారంతో ఇరువైపులా అడ్డంగా చెట్ల కొమ్మలు, పొదలను తొలగించారు. ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ పాల్గొన్నారు.

స్టీల్ ఒబిసి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలకు

మూడు ప్యానెల్స్ నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : జనవరి 7న జరగనున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఒబిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలకు మూడు ప్యానెల్స్ నామినేషన్లు దాఖలు చేశాయి. ఒక ప్యానెల్‌కు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో పాటు 28 మంది కార్యవర్గ సభ్యులుగా 30 మందితో ప్యానెల్ ఏర్పాటు కానుంది. ఎన్నికల అధికారిగా జెవి రావు వ్యవహరించనున్నారు. ఈనెల 30న నామినేషన్లు ఉపసంహరణకు ఆఖరి తేదీ. సిఐటియుకు సంబంధించి ఎస్ఎంఎస్ విభాగంలో పనిచేస్తున్న బి అప్పారావు అధ్యక్షుడిగా, జి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా నామినేషన్లు దాఖలు చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణ ప్రధాన ధ్యేయంగా పనిచేసేందుకు సిఐటియు ప్యానెల్‌ను బలపరచాలని ప్లాంట్‌లో అన్ని విభాగాలలో ప్రచారం చేపడుతున్నట్లు వెల్లడించారు.

స్టీల్ ఒబిసి ఎన్నికలకు జ్యోతీరావు పూలే ప్యానల్

స్టీల్‌ప్లాంట్ ఒబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో మహాత్మా జ్యోతీరావుపూలే ప్యానెల్ తరపున కోమటి రవిశంకర్, నక్కా వెంకటరమణతో సహ 30మంది సభ్యుల కమిటీ



నామినేషన్ దాఖలు చేస్తున్న జ్యోతీబా పూలే ప్యానెల్

నామినేషన్ దాఖలు చేసింది.స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న సుమారు 47శాతం ఒబిసి ఉద్యోగుల చట్టపరమైన హక్కులు కోసం పోరాడడంతోపాటు 2017 నుంచిఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి యాజమాన్యం సహకారంతో ఇటీవలే సంఘం శాశ్వతభవనానికి సిఎండితో ప్రారంభోత్సవం జరిపించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు పొందేందుకుతమ ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెల్లి అప్పలరాజు, కొణతాల శ్రీనివాసు, పిల్లి చంద్రరావు నమ్మి తాతారావు, వియం నాయుడు, కెజె అప్పారావు, వియస్ఆర్ మూర్తి, చిన్నారావు, రాజమోహన్, రాజేష్ పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో అండర్ పాత్‌వే

ప్రజాశక్తి -ఆనందపురం : జాతీయ రహదారి నుంచి వెల్లంకి గ్రామంలోకి వెళ్లే అండర్ పాత్‌వే నిర్మాణానికి రూ. 10లక్షల మండల పరిషత్ నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు తెలిపారు. మండల పరిషత్ నిధులతోపాటు అవసరమైతే పంచాయతీ నిధులను కలిపి దీన్ని అభివృద్ధి చేస్తామన్నారు. బుధవారం ఎంపిపి మజ్జి శారదప్రియాంక, ఇతర నేతలు పాత్‌వేను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి బొట్ట రామకృష్ణ ధనలక్ష్మి వైసిపి నేతలు కాకర వెంకటరమణ, పడాల రాము, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కె.చంద్రమౌళి, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, ఎంపిటిసి పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణపై మైక్ ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం : రోడ్డు ప్రమాదాల నివారణపై స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం ఆధ్వర్యంలో సిబ్బంది ఆటో మైక్ ద్వారా ప్రచారం చేపట్టారు. ఆనందపురం నుంచి బోని వెళ్లే మార్గంలో ఆనందపురం మార్కెట్, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం గ్రామాలలో మైక్‌తో ప్రచారం చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన విశాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సిబిసి) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎగువపేట వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ బుధవారం ముగిసింది. అంగన్వాడీ, మిడ్డేమీల్స్ తదితర పథకాల అమలపై ఫొటో ప్రదర్శనను పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో సిబిసి సహాయ సంచాలకులు షఫీ అహమ్మద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : 46వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బుధవారం పరిశీలించారు. సుందర వార్డుగా తీర్చిదిద్దే క్రమంలో వార్డులో చురుగ్గా సాగుతున్న డ్రైనేజీలు, కల్వర్టులు, గెడ్డ కాలువలు, ఇతర పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతలో రాజీలేకుండా త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కె.చిన్నా, ఎస్ కృష్ణ , పి ఈశ్వరి, సచివాలయం సిబ్బంది, జివిఎంసి సిబ్బంది, వర్క్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - ములగాడ : ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా టిఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కల లక్ష్మణరావు ఆధ్వర్యంలో రామకృష్ణాపురం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఫాస్టర్ సాలెం రాజు ప్రార్థనతో ప్రారంభించిన వేడుకలో పాల్గొన్న క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు ఊరుకూటి డేవిడ్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన గడచిన నాలుగేళ్లలో క్రిస్టియన్లకు టిడిపి హయాంలో ఇచ్చిన క్రిస్మస్ కానుకకు ఎసరు పెట్టేశారన్నారు. రాష్ట్రంలో పాస్టర్లపై దాడులు జరుగుతున్నా జగనన్న ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఈ సందర్భంగా ఐదు చర్చిల పరిధిలోని



సరుకులు పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు, సోమేష్, డేవిడ్

నిరుపేదలకు ఐదు కిలోల బియ్యం, పంచదార, కందిపప్పు, చింతపండు, మినపపప్పు కిలో చొప్పున అందజేశారు. కార్యక్రమంలో కె.ఆది, మజ్జి సోమేష్, జయశంకర్, సత్తిబాబు, మైనార్టీ నాయకులు రెహమాన్, ఎకె. సురేష్, రంజాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

పలుచోట్ల గడపగడపకూ...

ప్రజాశక్తి -సీతమ్మధార : 26వ వార్డులో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్ 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు, 26వ వార్డు అధ్యక్షురాలు పీల వెంకటలక్ష్మి, బొడ్డేటి కిరణ్‌కుమార్, పాండవ శ్రీను, పోతు సత్యనారాయణ పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ గ్రామాల్లో బుధవారం రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈసందర్భంగా స్థానికులు పలు సమస్యలను



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కెకె.రాజు

విన్నవించారు. మురుగు కాలువల్లో చెత్త తొలగింపు, అర్హులైన వారికి పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు, ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి స్పందిస్తూ, తగు చర్యలకు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు మండల పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణ సర్పంచ్ లక్ష్మీభవానీ, నేతలు నారాయణరావు, అప్పలరాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అమాయక యువతను లక్ష్యంగా చేసుకొని ఉద్యోగాల పేరుతో వాట్సప్ ద్వారా పని కల్పిస్తామని, వర్క్ ఫ్రమ్ హోమ్ అని నమ్మించి, అనధికారిక లింకుల ద్వారా నగదు దోచుకుంటున్న ఆరుగురు సభ్యుల ముఠాను నగర పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మీడియా సమావేశంలో సిపి శ్రీకాంత్ వివరాలనుతెలిపారు. అక్టోబర్ 13న విశాఖకు చెందిన ఒక వ్యక్తి రూ.12,83,670 మోసపోయాడని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు బీహార్‌కు చెందిన సుమన్ సాహా రాజస్థాన్‌కు చెందిన, శుభం సింగ్, దీపక్ సంగ్రా, ప్రణవి చౌహాన్, మిట్టు లా జట్, వికాస్ బాసితలను అరెస్టుచేశారు. ప్రదీప్ చౌదరి, రాజినిష్ గుజ్జారా, మాజిద్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సిపి తెలిపారు. గ్లోబల్ ఎక్స్, ఒ పెల్, బి-లైట్ కంపెనీల పేరుతో యాక్సిస్ బ్యాంక్, ఎస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్ ఐడిఎఫ్‌సి బ్యాంకు అకౌంట్ల ద్వారా నగదు సేకరించారని తెలిపారు. వారి నుంచి 30 సెల్ ఫోన్లు, 20 సిమ్ కార్డులు, 26 ఎటిఎం కార్డులు, 37 బ్యాంకు చెక్కులు, 56 ఫేక్ స్టాంపులు, 8 వివిధ కంపెనీల పేరుపై ఉన్న ఫ్లెక్సీలు స్వాధీనం చేసుకున్నామని, ఎస్ బ్యాంకులో ఉన్న రూ.ఐదు లక్షలను ఫ్రీజ్ చేశామని చెప్పారు. ప్రజలంతా వాట్సాప్ ద్వారా వచ్చే ఆన్‌లైన్ జాబ్స్, వర్క్ ఫం హోమ్‌కు సంబంధించిన జాబ్స్‌పై అవగాహనతో వ్యవహరించాలని కోరారు.

పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి -కంచరపాలెం: పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను కంచరపాలెం క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుంధవారం వేలం నిర్వహించారు. గోపాలపట్నం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు 11 వాహనాలకు రూ.61 వేల ప్రభుత్వం ధరతో వేలం నిర్వహించగా, రూ. 63,900వచ్చిందని సిఐ కూనదుర్గాప్రసాద్ తెలిపారు. వేలంలో ఎనిమిది మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్.ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

దివీస్‌లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-భీమునిపట్నం :చిప్పాడ దివీస్ పరిశ్రమలో ఉద్యోగాల కల్పనలో స్థానికుల అధిక ప్రాధాన్యతనివ్వాలని ఎంపిపి ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసురాజు) యాజమాన్యాన్ని కోరారు. దీనికి భిన్నంగా స్థానికులకు ఆశించిన స్థాయిలో ఉద్యోగాలివ్వని దివీస్ యాజమాన్య వైఖరిపై చేతికి నల్లరిబ్బన్ కట్టుకుని



చేతికి నల్ల రిబ్బను కట్టి ఎంపిపి నిరసన

నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమలు ఉండాలి, బాగుపడాలని, అదే సమయంలో స్థానిక గ్రామాలూ బాగుపడాలన్నారు. అలా జరగాలంటే ఉద్యోగావకాశాల కల్పనలో స్థానికులకు పెద్దపీట వేయాలన్నారు. చిప్పాడ దివీస్‌లో మండలంలోని అన్నవరం, పెద నాగమయ్యపాలెం, చిప్పాడ, టి.నగరపాలెం, మూలకుద్దులో ఒక్కో పంచాయతీకి 20చొప్పున, మండలంలోని మిగిలిన 11 పంచాయతీలకు ఒక్కొదానికి 10 చొప్పున ఉద్యోగావకాశాలను కల్పించాలని కోరారు. పరిశ్రమలో ఉన్న ఉద్యోగుల సంఖ్యలో ఇది కేవలం రెండుశాతం లోపేనన్నారు. అదేసమయంలో దివీస్ సిఎస్ఆర్ నిధుల్లో 75శాతాన్ని స్థానిక పంచాయతీలు, ఇక్కడ ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఉక్కు డైరెక్టర్‌గా అరుణ్‌క్రాంతి

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్)గా బాధ్యతలు స్వీకరించిన అరుణ్‌క్రాంతి బగ్చి సిఎండి అతుల్ భట్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌కు చెందిన డైరెక్టర్లు సీనియర్ అధికారులతో చర్చించారు. 1988లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అరుణ్‌క్రాంతి 1988లో మీకాన్ లిమిటెడ్‌లో మేనేజ్మెంట్ ట్రైనీగా చేరారు. స్టీల్ ప్లాంట్‌లో బాధ్యతలు స్వీకరణకు ముందు నాగర్నార్ వద్ద ఎన్ఎండిసిలోప్రాజెక్ట్ మేనేజ్మెంట్ కనల్టెన్సీ సేవలో నాయకత్వం వహించారు. మెటల్స్ అండ్ ట్రెనింగ్ పవర్ డిఫెన్స్, స్పేస్ బీచ్ సౌండ్స్, న్యూక్లియర్ రిఫైనరీ స్పోర్ట్స్ మొదలైన విభాగ వివిధ రంగాల్లో 34ఏళ్ల విభిన్న హోదాల్లో అరుణ్‌క్రాంతి పనిచేశారు

అఖిల భారత తైక్వాండో పోటీలకు నవీన్



నవీన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి- పెందుర్తి : అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీలకు నరవ విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విద్యార్థి పి నవీన్ ఎంపికయ్యారు. విజయగనరం జెఎన్‌టియులో జరిగి పోటీల్లో విజేతనిలిచి, బంగారు పతకాన్ని సాధించిన నవీన్, వచ్చేనెల 3 నుంచి 6 వరకు పంజాబ్ రాష్ట్రం అమృతసర్ గురునానక్ యూనివర్సిటీలో జరగనున్న పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో నవీన్ అభినందించిన అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది, అఖిలభారత పోటీల్లోనూ రాణించి, పతకంతో రావాలని ఆకాంక్షించారు.

గ్రామ పంచాయతీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వెంకటలక్ష్మి



రాజేంద్రప్రసాద్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న వెంకటలక్ష్మి

ప్రజాశక్తి -పద్మనాభం: రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శిగా పద్మనాభం మండలం, అనంతవరం గ్రామ సర్పంచ్ గొర్రిపాటి వెంకటలక్ష్మి ఎంపిక చేసినట్లు. ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఎలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మికి ఎంపిపి రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణ, ఇయర్ల ఈశ్వరరావు, పలువురు నేతలు, అనంతవరం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షునిగా సోమశేఖర్



సోమశేఖర్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, విశాఖపట్నం అధ్యక్షునిగా జోగి సోమశేఖర్ నియమితులయ్యారు. బుధవారం కంచరపాలెం జాతీయ రహదారిలోని గిరీశ శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్‌లో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సుందర్‌రామ్, ప్రధాన కార్యదర్శి జనార్దన, జివిపిఎస్ఎ అధ్యక్షుడు భాస్కరరావు,కౌన్సిల్ సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో సోమశేఖర్‌ను అసోసియేషన్ విశాఖపట్నం అధ్యక్షునిగా నియమించి, సత్కరించి, అభినందించారు. ఇదే సమయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల అసోసియేషన్ అధ్యక్షులుగా తమ్మినేని సింహాచలం, డి.రామకృష్ణారావు, గట్టి పాపారావులను నియమించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ, అసోసియేషన్ విశాఖపట్నం శాఖ అభివృద్ధికి, ప్రైవేట్ స్కూల్స్ ఐక్యతకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి రాష్ట్ర అధ్యక్షుడు సుందరరావు పలు సూచనలు చేశారు. పలు ఉత్తర్వులకు సంబంధించిన ఫైల్స్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ అందజేశారు. సోమశేఖర్‌కు తమ అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని భాస్కరరావు వెల్లడించారు. అనంతరం విశాఖపట్నం డిఇఒ చంద్రకళ కలిసి, అసోసియేషన్ విధివిధానాలను వివరించారు.

అత్యవసర సన్నద్ధతపై స్టీల్‌ప్లాంట్‌లో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ పర్యవేక్షిస్తున్న శివశంకర్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిఐఎస్ఎఫ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్ రెడ్డి పర్యవేక్షణలో స్టీల్‌ప్లాంట్‌లో ప్లాంట్ లెవెల్ మాక్‌డ్రిల్ బుధవారం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్. గ్యాస్ మిక్సింగ్ స్టేషన్‌లో కల్పిత గ్యాస్ లీక్ చేసి, అనంతరం ఆన్ సైడ్ ఎమర్జెన్సీ ప్రిపేర్ చేయడానికి ఈ డ్రిల్ ఏర్పాటు చేశారు. మాక్ డ్రిల్‌లో వైద్య సేవలు, గ్యాస్ భద్రత వంటి అత్యవసర సేవా విభాగాలు, సేఫ్టీ డిపార్ట్మెంట్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్, డిపార్ట్‌మెంట్ సిఐఎస్ఎఫ్, సెక్యూరిటీ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ పాల్గొన్నాయి. గ్యాస్ సేఫ్టీ టీం వెంటనే గ్యాస్ మానిటర్లు, ఆర్టిఫిషియల్ రెస్పిరేటర్లతో ఘటన స్థలానికి చేరుకొని పేలుడు పదార్థాల సాంద్రతను విశ్లేషించారు. రెస్క్యూ టీం వచ్చేవరకు బాధితులకు ఆక్సిజన్ అందించారు. టిఐఎస్ఎఫ్ భద్రత సిబ్బంది దిసత్మక ఆపరేషన్లు చేపట్టాయి. సెల్ఫ్ కంటెంట్ బ్రీతింగ్ ఆపరేటర్స్ ఇతర అత్యవసర ప్రతిస్పందన పరికరాలను ఉపయోగించి బాధిత వ్యక్తులను రక్షించడానికి స్పాట్ నుంచి తరలింపు వంటి అనే ప్రక్రియలను మాక్ డ్రిల్‌లో చేశారు. స్టీల్ ప్లాంట్ బృందం కృషిని . శివశంకర్ రెడ్డి ప్రశంసించారు. కార్మికుల భద్రత కోసం మరిన్ని సూచనలు చేశారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎవిఎస్ కష్యయ్య మార్గదర్శకంలో ఈ ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీనియర్ అధికారులు కె.సుధాకర్, ఎంకె. రావు ఉత్తమ్ బ్రహ్మ పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు నోటీసులు తాత్కాలికమే

వైసిపి కన్వీనర్లు, వాలంటీర్లతో సమీక్షలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి



పిఎం.పాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి- మధురవాడ : అర్హులైన ప్రతిఒక్కరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం కొందరికి పింఛన్ల తొలగింపు నోటీసులు తాత్కాలికమేనని, పరిశీలన అనంతరం అర్హులందరి పింఛన్లు కొనసాగిస్తామన్నారు. బుధవారం ఎండాడ బిసి కాలనీలో 7, 8 వార్డుల వైసిపి కన్వీనర్లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్లు తొలగింపుపై ప్రతిపక్షాల దుష్ప్రచారం నమ్మొద్దన్నారు. నియోజకవర్గ వైసిపి పరిశీలకులు, మాజీ మంత్రి బాలరాజు, 8వవార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు, అల్లాడ ఉమామహేశ్వరరావు, పోల్ రెడ్డి, గోపి, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, లింగేశ్వరరావు, కుడితి రామారావు, మధు బుజ్జి, లక్ష్మణ రెడ్డి, రాజేశ్వరి, రజిని పాల్గొన్నారు.

వాలంటీర్లు, కన్వీనర్లు బాధ్యతతో పనిచేయాలి

ఆనందపురం : సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు బాధ్యతతో పనిచేసి వైసిపి బలోపేతానికి పనిచేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, జగన్‌ను మళ్లీ సిఎంను చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, మండల వైసిపి అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, జడ్పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపిపిలు పాంద్రంకి శ్రీను, బొట్టా రామకృష్ణ, సోషల్ మీడియా ఇంచార్జ్ భాగం స్వాతి సుధాకర్, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ రామారావు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఉన్నంత వరకు భీమిలి నుంచే పోటీ.! : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పిఎం పాలెం : రాజకీయాల్లో ఉన్నంతవరకు తనకు రాజకీయంగా జన్మనిచ్చిన భీమిలి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జివిఎంసి ఆరో వార్డు, అవంతి కమ్యూనిటీ హాల్‌లో సచివాలయ కన్వీనర్లతో ముఖాముఖిలో ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలకు చేరవేసే వారధులుగా కన్వీనర్లు పనిచేయాలని కోరారు. పింఛన్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్, జోనల్ కమిషనర్‌లకు సూచించారు. కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు, రూరల్ తహశీల్దార్ పాల్ కిరణ్, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత సత్యనారాయణ, 6వ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, గాదే రోషిరెడ్డి, పోతిన మూర్తిబాబు, పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్, పిల్లా రమణ, కురిటి లోహిత్, రాయిన సాయి, జె ఎస్ రెడ్డి, కొండపల్లి వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యా పథకాలను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులతో కలిసి గోరుముద్ద రుచి చూస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -కంచరపాలెం : జగనన్న ప్రభుత్వం అందిస్తున్న విద్యాపథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. బుధవారం 50వ వార్డు మాధవధార జివిఎంసి హైస్కూల్‌లో స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, బగాది విజయ్‌కుమార్, పేడాడ రమణకుమారి, రామారావు, బమ్మిడి మురళి, సనపల నారాయణస్వామి, సభవరపు శ్రీను, సోనీ, రాంబాబు, రామ్మోహన్, సనపల సరోజ, చిటికెల శ్రీను, దాలినాయుడు, సరస పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, విద్యార్థులతో కలిసి రుచిచూశారు.

పిఎం పాలెం: .కొమ్మాది సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్.అప్పలనాయుడు, టి. రాంబాబు, తల్లిదండ్రుల కమిటీ ఉపచైర్మన్ పి.సూర్యప్రకాష్ రవి పాల్గొన్నారు.

ములగాడ : 58 వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ గొలువెందల లావణ్య ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం ఎం లక్ష్మణ్, వార్డు వైసిపి నేతలు గులివెందుల కృష్ణ, ఉపాధ్యాయులు యశోద, స్వప్న, ఆచారి, మనోహర్ పాల్గొన్నారు.

రూ.1.10 కోట్ల వాహన ప్రమాద బీమా



పరిహారం చెక్కును అందజేస్తున్న న్యాయమూర్తి బులికృష్ణ

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వాహన ప్రమాద పరిహారం కింద రూ.కోటి పది లక్షలను బాధితురాలికి బుధవారం చెక్కును అందజేశారు. క్లైమ్ లోక్అదాలత్ (రోజువారి లోక్ అదాలత్)లో రాజీద్వారా పరిష్కరించి కేసును పరిష్కరించి, బాధితురాలికి పరిహారం చెక్కును డిఎల్ఎస్ఎ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బులిక్రిష్ణ అందించారు. పర్మినెంట్ లోక్అదాలత్ చైర్మన్ వల్లభ నాయుడు, సభ్యులు ఎం.గౌతమి, విశాలాక్షిలతో కూడిన బెంచ్, ఈ క్లైమ్ పరిష్కారానికి అవార్డును జారీ చేశారు. కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ ఇటీవలే వాహన ప్రమాదంలో మరణించారు. ఆయన భార్య పరిహారం కోసం కోర్టును ఆశ్రయించారు. బాధితురాలితో ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ పరస్పర అంగీకారంతో రాజీ చేశారు. పిటిషనర్ తరపున అడ్వకేట్ పి లక్ష్మణరావు, ఇన్సూరెన్స్ కంపెనీ తరపున అడ్వకేట్ నగేష్ పాల్గొన్నారు.

అపోలోలో అరుదైన ఆర్థో ఆపరేషన్



ఎండోస్కోపి ద్వారా పాదం వెనుక భాగంలో శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలో ఆసుపత్రిలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, హెచ్ఒడి డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ ఆధ్వర్యంలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 21 ఏళ్ల మహిళ ఆరు నెలలుగా కుడి చీల మడమ వాపు, నొప్పితో బాధపడుతున్న నేపథ్యంలో అపోలో వైద్యులను సంప్రదించగా, ఎంఆర్ఐ స్కాన్ ద్వారా సబ్‌టలార్ జాయింట్ నుండి ఉత్పన్నమయ్యే గ్యాంగ్లియన్ తిత్తి ఉందని గమనించారు. డాక్టర్ ఖాన్ పాద వెనుక నుంచి ఎండోస్కోపి ద్వారా శస్త్రచికిత్స చేసి గ్యాంగ్లియన్ తిత్తిని తొలగించారు. ఆపరేషన్ చేసిన రోజునే రోగిని డిశ్చార్జి చేశారు. పాదం వెనుక భాగంలో ఎండోస్కోపీ ద్వారా శస్త్రచికిత్స చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారని అపోలో వైద్యులు పేర్కొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'



సింహాచలంలో ప్రభుత్వ వైఫల్యాలపై టిడిపి నిరసన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లిలో మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు ఆధ్వర్యంలో టిడిపి నేతలు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, అరాచక పాలనను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, మద్యపాన నిషేధం, మహిళలకు భద్రత లేకపోవడం, విద్యుత్ బస్‌ఛార్జీల మోత, అధిక ధరలు, పన్నుల భారం, అధ్వానపు రోడ్లు, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అరాచక జగన్ ప్రభుత్వాన్ని సాగనంపి, టిడిపిని ఆదరించాలని కోరారు.

సింహాచలం: 98వ వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం ఆధ్వర్యంలో పోస్టాఫీస్ వీధిలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా వీధి దీపాల సమస్యలను స్థానికులు వివరించారు. టిడిపి నేతలుపంచదార శ్రీనివాసరావు, గుసిడి అవినాష్, బంటి శ్రీనివాసరావు, తాళ్లపూడి నాగరాజు, పని మనోహర్, మణిబాబు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లకు కత్తెర



- ★ తొలగింపే లక్ష్యంగా రేషన్ కార్డుల్లోని ఐదారేళ్ల క్రితం వివరాల ఆధారంగా నోటీసులు
- ★ లేని భూమిని చూపిస్తూ తొలగింపునకు చర్యలు
- ★ ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

వెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వం సామాజిక పింఛన్లు తొలగింపునకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 40-50 సంవత్సరాల నుండి పింఛన్లు పొందుతున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛన్లు కూడా తొలగిస్తోంది. ఇందు కోసం వివిధ కారణాలతో పింఛనుదారులకు నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో ఉన్న వివరాలు ఆధారంగా కాకుండా ఐదారేళ్ల క్రితం రేషన్ కార్డుల్లో ఉన్న వివరాలను ఆధారంగా ప్రస్తుతం పింఛన్లను తొలగిస్తున్నారు. బుచ్చయ్యపేట మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 200 పింఛన్లను తొలగించడానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. తమకు జీవనాధారంగా ఉన్న పింఛన్లు నిలిపివేయడంతో వీరంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కూతురు కుమారుడికి కారు ఉందని..



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు ముచ్చకర్ల గంగమ్మ. మండలంలోని పి.భీమవరం శివారు గొన్నువానిపాలెం గ్రామానికి చెందిన గంగమ్మ భర్త 50 సంవత్సరాల క్రితం చనిపోయారు. నాటి నుండి ఆమె తన కుమార్తె ఇంటి దగ్గర ఉంటుంది. ఎన్నోఏళ్లుగా పింఛను పొందుతోంది. గంగమ్మ కుమార్తె కుమారుడైన (గంగమ్మ మనవడు) సెలపురెడ్డి భాస్కర్ శివకుమార్ గతంలో వీరితో కలిసి రేషన్ కార్డులో ఉండేవాడు. శివకుమార్‌కు వివాహం కావడంతో ఉమ్మడి రేషన్ కార్డు నుండి వేరుపడి, భార్య పిల్లలతో ఐదేళ్ల క్రితం వేరే రేషన్ కార్డును పొందాడు. ప్రస్తుతం గంగమ్మ, ఆమె కుమార్తెకు కలిపి రేషన్ కార్డు ఉంది. గంగమ్మ మనవడు విశాఖపట్నం వెళ్లి కారు కొనుక్కున్నాడు. ప్రస్తుతం వెరిఫికేషన్‌లో భాగంగా గంగమ్మకు కారు ఉందంటూ మూడు నెలలుగా పింఛను నిలిపివేశారు. దీంతో ఆమె నాటి నుండి పి.భీమవరం సచివాలయం, మండల కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. తనకు కారు లేదని మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదని గంగమ్మ వాపోయింది.

లేని భూమి చూపించి...



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు గోగుల సత్యవతి. రాజాం గ్రామానికి చెందిన సత్యవతి భర్త సత్యారావు మూడు సంవత్సరాల క్రితం చనిపోవడంతో ఆమెకు వితంతు పింఛను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పుడు వెరిఫికేషన్‌లో సత్యవతికి 10 ఎకరాల భూమి ఉందని చూపించి పింఛను నిలిపివేస్తూ నోటీసు జారీ చేశారు. రాజాం రెవెన్యూ పరిధిలో సత్యవతి భర్త పేరుతో మూడు ఎకరాల భూమి ఉంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త పేరుతో ఉన్న భూమి కుమారుల పేరున ట్రాన్స్‌ఫర్ చేయడానికి ప్రయత్నాలు చేస్తుండగా, ఇంతలోనే పింఛన్ నిలిపి వేశారు. రికార్డుల్లో ఉన్న ప్రకారం 10 ఎకరాల భూమి ఉంటే తనకు అప్పగించాలని సత్యవతి కోరుతోంది.

దిబ్బిడి గ్రామంలో 85 సంవత్సరాల వృద్ధురాలకు పింఛను నిలిచిపోవడంతో సచివాలయానికి వెళ్లి ఆరా తీయగా, ఆమెకు భూమి ఉందని చెప్పడంతో ఆశ్చర్యపోయింది. గతంలో ఈమెతో పాటు కొడుకు, కోడలు, మనుమడు ఒకే రేషన్ కార్డులో ఉండేవారు. మనవడికి వివాహం కావడంతో ఈ కార్డు నుండి వేరుపడి నాలుగేళ్ల క్రితం వేరే రేషన్ కార్డు పొందాడు. మనవడు భార్యకు పుట్టింటి వారు రెండు ఎకరాల భూమి రాశారు. ఆ భూమితో కలిపి నాలుగు ఎకరాలకు పైగా భూమి ఉందంటూ పింఛను నిలిపివేస్తూ నోటీసులు జారీ చేశారు. మండలంలోని రాజాం గ్రామంలో-6, కందిపూడిలో సచివాలయ పరిధిలో 6 నిలిపివేశారు. ఇలా ప్రతి సచివాలయ పరిధిలోనూ పింఛన్లను నిలిపివేస్తూ నోటీసులను జారీ చేశారు. పింఛన్ల సంఖ్య తగ్గించుకునే లక్ష్యంతోనే పాత కార్డుల్లో ఉన్న వివరాల ఆధారంగా పింఛనుదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. తమకు జీవనాధారంగా ఉన్న పింఛన్లు నిలిపివేయడంతో వీరంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పింఛన్లు తొలగిస్తే తాము ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. నోటీసులో వివరాలకు, వాస్తవ వివరాలకు సంబంధం లేకుండా పింఛన్లు నిలిపివేయడం పట్ల పింఛనుదారులు మండిపడుతున్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి



మాట్లాడుతున్న సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాకు చెందిన మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు, ఇతర శాసనసభ్యుల సహకారంతో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి తెలిపారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సమావేశం మందిరంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో రూ.3 కోట్లతో గాంధీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో రూ.70 లక్షలతోనూ, నూకంబిక ఆలయంలో రూ.70 లక్షలతోనూ వసతి సముదాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సిఎస్ఆర్ నిధులతో తుమ్మపాల గ్రోయిన్ల మరమ్మత్తు, ఎల్లయ్య కాల్వ డీసెల్టు చేసి ఆవఖండం భూములకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కసింకోట మండలంలో వాటర్ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడూరులో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేశామని, మహిళలకు ప్రత్యేకంగా 100 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. బొజ్జన్న కొండను రూ.14 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.



పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి తదితరులు


జగనన్న భూ హక్కు పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో జగనన్న భూ హక్కు పాస్ పుస్తకాలను బుధవారం జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సంక్షేమ కోసం భూ హక్కు పాస్ పుస్తకం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, శిరపరపు శివ, హనుమంతు వెంకట లక్ష్మణరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రామునాయుడుకు అభినందనలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మండలంలోని పి.భీమవరం సర్పంచ్ పినపోలు రామునాయుడును బుధవారం మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. మంగళవారం విజయవాడలో ఎలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పంచాయతీరాజ్ ఛాంబర్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. చోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్లా పోలినాయుడు, జిల్లా అగ్రికల్చర్ డైరెక్టర్ గుడాల ఆనంద్, ఎల్.సింగవరం సచివాలయ కన్వీనర్ రేణం స్వామినాయుడు, ఆర్ శివరాంపురం సచివాలయ కన్వీనర్ బోయిన నారాయణమూర్తి, పి.భీమవరం వైసీపీ యూత్ లీడర్ దేవర శ్రీను, పొట్టిదొరపాలెం సచివాలయ కన్వీనర్ గుద్దేటి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామనాయుడు మాట్లాడుతూ పంచాయతీలకు విధులు, నిధులు సాధించడానికి కృషి చేస్తానని చెప్పారు.



రామునాయుడును అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు



కోచ్ సత్యనారాయణతో రేణుకశ్రీ

జాతీయ యూనివర్శిటీ స్థాయి తైక్వాండో పోటీలకు రేణుకశ్రీ ఎంపిక

ప్రజాశక్తి - యలమంచిలి : జనవరి 8వ తేదీన పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో గురునానక్ యూనివర్శిటీలో జరగనున్న జాతీయ యూనివర్శిటీ స్థాయి తైక్వాండో పోటీల్లో ఆంధ్రాయూనివర్శిటీ తరపున యలమంచిలికి చెందిన రేణుకశ్రీ ఎంపికైనట్లు కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన రేణుకశ్రీని న్యూ ఆంధ్రాప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం అచ్చంనాయుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, బొద్దపు ఎర్రయ్యదొర, ఖస్తా రవికుమార్ తదితరులు అభినందించారు.

వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : తొలగించిన వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పాతరపల్లి వీరు యాదవ్ మాట్లాడుతూ సుమారు నాలుగు లక్షల పింఛన్లు రద్దు చేయడం అమానుషమని, వాటిని పునరుద్ధరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వికలాంగ నాయకులు గన్రెడ్డి రాము, మెరుగు నూకరాజు, లెక్కల గోవిందు, పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం కార్యదర్శి లోకనాథం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

కార్మిక, కర్షక, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, అందుకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల కుదింపు, ఆస్తి విలువ ఆధారిత పన్ను పెంపు, గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరల పెంపు, ప్రజలపై మోయలేని భారాలు వంటి సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. జిల్లాలో మూతపడ్డ ఏటికొప్పాక, తాండవ, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలను తక్షణమే తెరిపించి క్రషింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, అసంఘటిత రంగ కార్మిక, స్కీం వర్కర్ల పోరాటాలకు సిపిఎం వెన్ను దన్నుగా నిలుస్తోందని చెప్పారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ, ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతానికి పార్టీ పోరాడుతుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు కూలి రేట్లు పెంచాలని, 200 పని దినాలు కల్పించాలని, రైతు, కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ప్రభావతి, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, నాయకులు ఆర్.శంకర్రావు, గంట శ్రీరామ్, వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, ఆర్ రాము, ఎ.బాలకృష్ణ, సత్తిబాబు, రాజు, దేవుడు నాయుడు, ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లపై అధిక శాతం వడ్డీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ డిపాజిట్‌దారులకు అధిక శాతం వడ్డీ చెల్లిస్తుందని ఆ బ్యాంకు తుమ్మపాల శాఖ అధికారి కుప్పిలి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంకు సేవలపై బుధవారం మండలంలోని పాపయ్య సంతపాలెంలో గ్రామ సభ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు 444 రోజులకు 7.6 శాతం, 777 రోజులకు 8 శాతం, మిగిలిన ఖాతాదారులకు 444 రోజులకు 7.1 శాతం, 777 రోజులకు 7.6 శాతం నెలసరి వడ్డీకి ఈ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, బ్యాంకు మిత్ర కోరుపల్లి పుష్పలత, సర్పంచు అన్నం చెల్లయ్యమ్మ, ఖాతాదారులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

59వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి ఎనిమిది గ్రామాల నిర్వాసితులు వాడనర్సాపురం సమీపంలో నేవీ గేటు ముందు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 59వ రోజుకు చేరుకుంది. గతంలో అధికారులు ఇచ్చిన హామీలను, తమతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. సుమారు రెండు నెలల నుంచి తమకు ఉపాధి లేక అనేకమైన ఇబ్బందులు పడుతున్నామని, అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి పెద్దలు కోరారు.

తాళ్ళపాలెం- నర్సీపట్నం రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్ నుంచి నర్సీపట్నం వెళ్లే రహదారిలో సంత మార్కెట్ వద్ద పడ్డా పెద్ద పెద్ద గోతులను బుధవారం ఆర్ అండ్ బి అధికారులు పూడ్చివేసి మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ పెద్ద పెద్ద గొంతుల వల్ల ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా ఉండేది. ఎట్టకేలకు ఆర్ అండ్ బి ఎఈ సత్యవాణి దగ్గరుండా మరమ్మతులు చేశారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెంలో డ్రైనేజ్ పైపుల ఏర్పాటు పనులను ఆ గ్రామ సర్పంచ్ బలిజ మంగ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ లేక పోవడం వల్లవీధి వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ ముసలినాయుడు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ శివబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ రమణ పాల్గొన్నారు.

దళితుల సమర భేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 30న దళితుల సమర భేరి ర్యాలీని విజయవంతం చేయాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో బుధవారం సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు ఎలక మొల్లి బాబు, తోటాడ విజయ్, చెవ్వేటి అప్పారావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు నడిపల్లి గణేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి- పరవవాడ : మండలంలోని పి.బోనంగి పంచాయితీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు అడ్డుకోవడం సరికాదని స్థానిక సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర్ అన్నారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పి.బోనంగిలో కాలువలు నిర్మాణ పనులు సుమారు రూ.6.80 లక్షలతో జరుగుతుండగా, బుధవారం పెదపూడి నారాయణమూర్తి ఇంటి నుండి బి.అమ్మాజీ ఇంటి వరకు పనులను దేముడు అడ్డుకున్నారని తెలిపారు. ఇది ఆర్ అండ్ బి స్థలం కాగా, అది తమదని దేముడు అనడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి డెక్క శ్రీనివాసరావు, బండారు బోయన్న, బండారు చిన్నా, కె.శ్రీను, కె.సూరిబాబు, బి.తాతబాబు పాల్గొన్నారు.

మహిళల భద్రత చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- దేవరాపల్లి : మహిళల భద్రత చట్టాలపై విద్యార్థులకు అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం సహకారంతో బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక మహిళా పోలీసు వరలక్ష్మి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజ్, కైరళి హైస్కూల్‌లో వీడియో రూపంలో చూపించి అవగాహన కల్పించారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేరాలు కట్టడికి చర్యలు

ఎస్‌పి గౌతమి శాలి



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి గౌతమి శాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

నేరాలను నివారించేందుకు పోలీస్ శాఖ పలు చర్యలు చేపడుతుందని అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై నేరాల పట్ల రిపోర్టింగ్ పెరగాలని, అప్పుడే నేరస్తుల్లో భయం వస్తుందని తెలిపారు. దిశా పోలీస్ స్టేషన్లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెక్షన్ ఏర్పాటు చేశామని చెప్పారు. విజిటర్స్ మానిటరింగ్ సిస్టం ద్వారా బయట ప్రాంత వ్యక్తులపై నిఘా పెడుతున్నామన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఎక్కువ ఉన్న నేపథ్యంలో 30 మందితో రిస్క్ మేనేజ్మెంట్ బృందాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సైన్ బోర్డులు, స్టాప్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

2022లో రహదారి భద్రత ఎన్ఫోర్స్‌మెంట్ కేసులు 7,597, సైబర్ నేరాలు 59 నమోదైనట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై రూ.2,21,082 ఈ-చలానాలు విధించామన్నారు. ఆస్తికి సంబంధించిన నేరాలు 389 నమోదు కాగా, వీటిలో 54 శాతం రికవరీ చేశామని చెప్పారు. పోగొట్టుకున్న 131 మొబైల్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా జిల్లాలోని కోడూరులో ఈ ఏడాది ఫిబ్రవరి 14న 570 కేసుల్లో పట్టుబడిన 84,148.344 కిలోల గంజాయి, సుమారు ఐదు లీటర్ల ఆశిష్ ఆయిల్, ఈనెల 24న 177 కేసుల్లో రెండవ విడతగా 25,573 కిలోల గంజాయి, 19.50 లీటర్ల ఆశిష్ ఆయిల్ ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయ్ భాస్కర్, అనకాపల్లి, పరవాడ దిశ డీఎస్పీలు బి.సునీల్, పి.శ్రీనివాసరావు, మళ్ల మహేశ్వరరావు పాల్గొన్నారు.

తుపాన్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సుగర్ ఫ్యాక్టరీలు తెరిపించేందుకు చర్యలు
- రౌండుటేబుల్ సమావేశంలో రైతు సంఘాల నేతల డిమాండ్



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి- అనకాపల్లి

ఇటీవల మాండూస్ తుపాన్‌లో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, జిల్లాలో మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని పలువురు రైతు నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 30న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు నాయకులు మాట్లాడారు. సుగర్ ఫ్యాక్టరీలు మూసివేసిన నేపథ్యంలో వరి సాగు పెరిగిందని, అయితే పంట చేతికొస్తుందన్న సమయంలో తుఫాను వల్ల 15 వేల ఎకరాల పైగా పంట నష్టం జరిగిందని తెలిపారు. 30 శాతం పంట నష్టం జరిగితేనే పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమన్నారు. సుగర్ ఫ్యాక్టరీలు లేని అనకాపల్లి జిల్లాను ఊహించుకోలేమని, వెంటనే మూతపడ్డ వాటిని తెరిపించి క్రషింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ఎడమ కాలువ, సుజల స్రవంతి ప్రాజెక్టులు పూర్తిచేసే విధంగా ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఎం.అప్పలరాజు, ఎ.బాలకృష్ణ, పిఎస్.అజయ్ కుమార్, వైఎన్ భద్రం, కె.శంకర్రావు, కృష్ణ అప్పారావు, తెలయ్య బాబు, ఎస్.బ్రహ్మాజీ, డి.శ్రీనివాస్ మాట్లాడారు.

ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు

ప్రజాశక్తి-అనకాపల్లి


మహిళలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. స్థానిక వేల్పుల వీధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.82 లక్షలతో కొండ పాలెం రోడ్డు మరమ్మతుకు, రూ.11 లక్షలతో వేల్పుల వీధి సీతారామ కళ్యాణ మండపం రోడ్డుకు, మిరియాల కాలనీలో రూ.23 లక్షలతో సిసి రోడ్డు డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు మందపాటి జానకి రామరాజు, జాజుల రమేష్, పలక రవి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : వివిధ సాంకేతిక లోపాలతో అర్హులై ఉండి పథకాలు మంజూరు కాలేని వారికి తప్పకుండా తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని కూండ్రపువానిపాలెం, రామచంద్రపురం, బత్తివానిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఈర్లే అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, సర్పంచ్ బండారు ముత్యాల నాయుడు, దొగ్గ ఉమాశంకర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని పాటిపల్లి గ్రామ సచివాలయంలో ఎలమంచిలి శాసనసభ్యులు యువి రమణ మూర్తి రాజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండలంలోని అరబుపాలెంలో తారు రోడ్డును ప్రారంభించారు. అరబుపాలెం, తిమ్మరాజుపేట, పాటిపల్లి గ్రామాల విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచులు ఆడారి కృష్ణవేణి, బొడ్డేడ శ్రీనివాసరావు, కాండ్రేగుల నూకరాజు, వైసీపీ నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, బొడ్డేడ బుజ్జి, భీమిశెట్టి ఉమాశంకర్, కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.


రుద్రరాజును సత్కరిస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు

కాంగ్రెస్ పటిష్టతకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ నాయకుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం ఆయనను రుద్రరాజును కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న, అనకాపల్లి ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, నాయకులు కాళ్ళ వెంకట సత్యనారాయణ, మల్లపురెడ్డి సత్యనారాయణ, పడాల కొండలరావు విన్నకోట రాము పాల్గొన్నారు.

'మంత్రి కనుసనల్లోనే దోపిడీ, భూదందాలు'

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ కనుసన్నల్లోనే అనకాపల్లి నియోజకవర్గంలో దోపిడీ, భూదందాలు జరుగుతున్నాయని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి, కసింకోట మండలాల్లో మంత్రి అనుచరులు రెచ్చిపోయి దౌర్జన్యాలకు దిగుతున్నారన్నారు. దళిత, చిన్న సన్నకారు రైతుల భూములను తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను, ప్రకృతి సంపదను దోచుకుంటున్నారన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్, క్వారీ ద్వారా నెలవారి మామూలు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. సామాన్యులు కేసులు పెట్టకుండా పోలీసులపై అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నడిపల్లి గణేష్, సురే సతీష్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీని రద్దు చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : ఇటీవల ఏర్పాటు చేసిన జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీని తక్షణమే రద్దు చేసి కొత్త కమిటీని నియమించాలని ఎంఆర్‌పిఎస్ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోటివాడ సామ్రాట్ కుమార్ డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ నియామకం కోసం అర్హులైన ఎస్సీ ఎస్టీలు, ఎన్జీవోలను దరఖాస్తు చేసుకోవాలని ఇచ్చిన ప్రకటన మేరకు అన్ని కులాల వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నవంబర్ 1న జెసి అధ్యక్షతన 22 మందిని ఇంటర్వ్యూలు చేశారని, కాని మాల కులానికి చెందిన ఐదుగురు అభ్యర్థులను కమిటీ సభ్యులుగా నియమించడం పలు అనుమానాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. అందువల్ల ఈ కమిటీని రద్దు చేసి మాల, మాదిగ, రెల్లి కులాలు, గిరిజన, మహిళలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -దేవరాపల్లి : సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని పిహెచ్‌సి వైద్యాధికారులు ఎస్.లలిత, ఇ.పూజ్యత మేఘన వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సచివాలయ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, వైద్య సిబ్బందితో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ వ్యాధులపై ప్రజలకు కల్పించాల్సిన అవగాహనపై వివరించారు. అనంతరం క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు.

మూలపేటలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

30న సిఎం సభను విజయవంతం చేయండి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట: నర్సీపట్నంలో ఈ నెల 30న జరిగే ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక రామకోవెల వద్ద కన్వీనర్లకు, వాలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండలానికి 13 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తప్పనిసరిగా సిఎం సభకు తరలి రావాలన్నారు. ప్రతీ సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు ఎన్నుకోవడం జరిగిందన్నారు. కన్వీనర్లు, వాలంటీర్ల కలిసి ముఖ్యమంత్రి కార్యక్రమానికి ప్రజలను తరలించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ప్రభాకర్, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, మండలంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రావికమతం:రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ కోరారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సభను జయప్రదం చేసేందుకు గ్రామాల్లో ప్రజలను అధిక సంఖ్యలో తరలించాలని, వచ్చే నూతన సంవత్సరం నుంచి గ్రామ కన్వీనర్లు, వాలంటీర్లు సంయుక్తంగా పెన్షన్ దారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లు అందజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు అందరూ సంయుక్తంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మండల ఆగ్రో అడ్వైసరి కమిటీ చైర్మన్, మండల వైసీపీ నాయకులు కంచిపాటి జగన్నాథరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు ..

కోటవురట్ల:ఈనెల 30న నర్సీపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి సూచించారు. బుధవారం ఆయన మండల స్థాయి అధికారులతో మండల సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 85 బస్సుల ద్వారా సభకు వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యురాలు ఉమాదేవి, తహసిల్దారు జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, ఎంఈఓ పి.అప్పారావు, నక్కపల్లి ఈఓఆర్డి సీతారామరాజు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధికంగా ఖర్చు

ప్రజాశక్తి -రావికమతం:విద్యార్థులందరూ ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలన్న లక్ష్యంతో కొట్లాది రూపాయలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఖర్చు పెడుతున్నారని సర్పంచ్ దాసరి సూర్య కుమార్ వరహాలు తెలిపారు. కవగుంట ఎంపీయూపీ స్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలపై ఆరా తీశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడతో పాటు ఉన్నతమైన చదువుల వరకు పూర్తిగా ప్రభుత్వమే ఖర్చు చేస్తుందని తెలిపారు.విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘురాం పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం చేస్తున్న సర్పంచ్

పింఛన్లు పరిశీలన

పజాశక్తి-మాకవరపాలెం: మండలంలో నోటీసులు పొందిన పింఛన్లులను బుధవారం ఎంపీడీవో అరుణ శ్రీ పరిశీలించారు. విద్యుత్ బిల్లులు, ఇన్కమ్ ట్యాక్స్, అధిక శాతం భూమి ఇలా పలు రకాల కారణాలు ఉన్న 89 మందికి నోటీసులు జారీ చేశారు. వీరిలో 50 మంది పింఛనుదారులు తమకు అర్హత ఉన్న ఆధారాలతో ఎంపీడీవో వద్దకు వచ్చిన ధ్రువ పత్రాలను తనిఖీ చేయించుకున్నారు.ఈ నెల 30వ తేదీ లోపు తనిఖీ చేయించుకోవాలని ఆమె తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి పరిశీలన చేస్తామన్నారు.



పింఛన్ల వెరిఫికేషన్ చేస్తున్న ఎంపిడిఒ

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-చీడికాడ:విద్యకు ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్ తెలిపారు. చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ట్యాబులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగరాజు, వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్, స్కూల్ కమిటీ చైర్మన్ సుందరం, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని బుధవారం పలు ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లను పంపిణీ చేశారు. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గురుకులంలోనూ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పిటిసి గోసల కాసులమ్మ, సర్పంచ్ నేతల జయ రత్నకుమారి చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీసం రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరి, మాజీ సర్పంచ్ తాతారావు పాల్గొన్నారు .

దేవవరంలో వైసిపి నాయకులు గొర్ల నరసింహమూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్ లను అందజేశారు

కోటవురట్ల:విద్యార్థులకు ట్యాబులు ఇవ్వడం హర్షనీయమని బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పైల రమేష్ అన్నారు. వెంకటాపురం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రత్నం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో పి.కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ యెడగల బెన్నమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్ లో పంపిణీ చేశారు,

మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 62 మంది విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణ అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్, మాజీ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: కొవ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ రాజారావు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ: ఏఎల్‌పురం జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి విద్యార్థులకు నర్సీపట్నం మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ సిహెచ్.భాస్కర్‌నాయుడు, ఎంపిపి మణికుమారి, సర్పంచ్ లోచల సుజాతల చేతుల మీదుగా 157 మంది విద్యార్థులకు, 13 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలకు అదనంగా బెంచీలు ఇవ్వడానికి, అలాగే పాఠశాల నుండి రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు, వాలీబాల్ పోటీలకు అర్హత పొందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.బోసుభారతి, ఉపాధ్యాయులు ఎంవి.స్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ రామలక్ష్మి, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, ఎంపిటిసిలు బుల్లిప్రసాద్, కృష్ణ, వైసిపి నాయకులు శివ పాల్గొన్నారు. వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గొలుగొండ వైస్ ఎంపిపి జక్కు నాగమణి అన్నారు. జోగంపేట పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు.ఈ కార్యక్రమంలో జోగుంపేట సర్పంచ్ జువ్వల లక్ష్మి, అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామినాయుడు, సేనాపతి రమేష్, శ్రీరాన శ్రీను, జొన్న అప్పన్న, పెడిరెడ్ల రాము, వరహాలబాబు, చిట్ల అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట:మండలంలోని జమాదులపాలెం హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు జెడ్‌పిటిసి శ్రీధర్‌రాజు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కరక రాజ్యలక్ష్మి, మలసాల కిషోర్, కరక శేషు పాల్గొన్నారు.

దేవరాపల్లి:మండలంలోని ఎం.అలమండ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ దాడి జగన్నాథరావు(జగన్), చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటరావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి ప్రభుత్వ పాఠశాలలో వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పీఏసీ చైర్మన్ బురద రాజు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గెడ్డం చంద్రరావు, పంది ప్రసాద్, వేంపడ శ్రీను పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట:మండలంలోని కెపి.అగ్రహారం, సీతయ్యపేట పాఠశాలల్లో బుధవారం ప్రభుత్వం అందించిన ట్యాబులను 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. అగ్రహారంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ దేవర అప్పారావు 18 మంది విద్యార్థులకు ట్యాబ్లను అందజేశారు. సీతయ్యపేటలో 60 మంది విద్యార్థులకు పాఠశాల కమిటీ చైర్మన్ వజ్రపు బాబురావు, దాకారపు నాగరాజు, కరణం నాగేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏవి జగన్నాథరావు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

వైసిపి నేత ఎర్రయ్య మృతి

ప్రజాశక్తి-మాడుగుల: వైసిపి నేత, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి తండ్రి పెయ్యల ఎర్రయ్య (83) బుధవారం మృతి చెందారు. ఆయన అనేక సంవత్సరాలుగా మాడుగులలో పోస్టుమాన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. గత అనేక సంవత్సరాలుగా వైసీపీ పార్టీలో కొనసాగుతున్నారు. గత పంచాయతీ ఎన్నికలలో సర్పంచ గా పోటీ చేసేందుకు సన్నద్ధం, కాగా మహిళా రిజర్వేషన్ కావడంతో తన కుమార్తె కళావతికి సీటు కేటాయించారు. అందరితో కలుపు గోలుతనంతో పాటు సౌమ్యుడుగా మంచి పేరు ప్రఖ్యాతలు పొందారు. బుధవారం ఉదయాన్నే వేరే గ్రామానికి వెళ్ళడానికి సన్నద్ధం అవుతూ ఆకస్మికంగా కుప్ప కూలి మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని వివిధ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించారు.





ప్రారంభిస్తున్న గోవింద్, రామకృష్ణ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలంలోని మంగళాపురం ఆర్‌బికె వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌బికె ఇన్‌చార్జి, కోపరేటివ్ ప్రెసిడెంట్ యల్లపు గోవింద్, వైసిపి నేత కంటే రామకృష్ణలు ప్రారంభించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ, క్వింటా వరి ధాన్యానికి రూ.2040లు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఆర్‌బికేలను రైతులు వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మరేఖ, వ్యవసాయ శాఖ సహాయకురాలు రేణుక, సచివాలయం వెటర్నరీ సహాయకులు మణికంఠ, ఎంపిటిసి, వాలంటీర్లు పాల్గొన్నారు.

రావికమతం:మండలంలోని మేడివాడ పిఎసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎంపిపి పైలరాజు, మండల ఆగ్రో అడ్వైజర్ కమిటీ చైర్మన్ కంచిపాటి జగన్నాథరావు, సొసైటీ అధ్యక్షులు కుంచంగి కోటి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అద్యక్షులు అసరి శ్రీను పాల్గొన్నారు.




పంపిణీ చేస్తున్న బిజెపి నేత సతీష్

ఉచిత రేషన్ బియ్యం పొడిగింపుపై హర్షం

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్: దేశంలో ఉండే పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం కరోనా సమయం నుండి అమలులో ఉన్న ఉచిత బియ్యం పంపిణీ విధానాన్ని మరో సంవత్సరం పాటు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందని, ఇది దేశ ప్రజలకు ఒక శుభవార్త వంటిదని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర పదాధికారి, బిజెపి నర్సీపట్నం నియోజకవర్గ సంయోజక్ అడిగర్ల సతీష్ పేర్కొన్నారు. నర్సీపట్నం మున్సిపల్ పరిధి కొత్త బయపురెడ్డిపాలెంలో గల జాతీయ చౌకధర డిపోని సందర్శించి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచితంగా బియ్యం అందజేస్తుందన్నారు. ఈ ఉచిత బియ్యం పంపిణీ ఏడాది పాటు డిసెంబర్ 2023 వరకు పొడిగింపు నిర్ణయం రేషన్ కార్డు దారులందరికీ శుభవార్త అని చెప్పవచ్చునన్నారు. పొడిగించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నర్సీపట్నం మండల అధ్యక్షుడు బోలెం శివ, బి.జె.వై.యమ్ జిల్లా నాయకుడు కిరణ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని అమ్మపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శేషగిరి మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నాతవరం మండలం గన్నవరం మెట్ట స్కూల్‌లో ఉపాధ్యాయులు శేషగిరి విదులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆసుత్రికి తరలించే లోపు మార్గమధ్యలో మృతి చెందాడు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శేషగిరికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా హాకీ పోటీలు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం సీఎం కప్ అండర్ 18 హాకీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి.అనకాపల్లి జిల్లా స్పోర్ట్స్ అదారిటి అధికారి నగిరెడ్డి సూర్యారావు ఆధ్వర్యంలో హాకీ పోటీలు నిర్వహించారు. నక్కపల్లి, ఎలమంచిలికి చెందిన హాకీ క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని కోచ్ రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బియస్ హాకీ క్లబ్ ఫౌండర్ సూరిబాబు, చిన్న అప్పారావు, కార్యదర్శి తాతాజీ,రామచంద్ర రావు, నానాజీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గిరిజనుడు మృతి

రోడ్డు సౌకర్యం లేక అందని వైద్యం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు జీలుగులోవ గ్రామంలో సకాలంలో వైద్యం అందక ఓ గిరిజన వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన సీదిరి వెంకటరావు (45) కు గత రెండు రోజులుగా తీవ్ర కడుపు నొప్పి వచ్చింది. స్థానికంగా ప్రధమ చికిత్స అందించినప్పటికీ ఫలితం లేదు. గ్రామానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో వైద్యం అందలేదు. దీంతో ఆరోగ్యం విషమించి బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

ఏళ్ల తరబడి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరినా ఫలితం లేదని సిపిఎం నాయకులు గోవిందరావు తెలిపారు. ఇప్పటికైన రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పోలీసు ఉద్యోగాలకు శారీరక దారుఢ్య శిక్షణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎపి ఎస్ఐ, కానిస్టేబుల్‌ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న యువతకు అల్లూరి స్టడీ సర్కిల్ అధ్వర్యాన ఉచిత శారీరక దారుఢ్య శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ బి.గంగారావు తెలిపారు. నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో అభ్యర్థులకు 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగు, లాంగ్ జంప్ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా అభ్యర్థులకు ఆహార నియమాలపై అవగాహన కల్పిస్తారని, ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రలోని స్టడీ సర్కిల్ కార్యాలయానికి ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8008412798 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కొత్త ఐటి పాలసీ : మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఐటి పాలసీని తీసుకురానుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 16, 17 తేదీలలో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ టెక్ సమ్మిట్ ఏర్పాట్లుపై పల్సస్ గ్రూప్ లిమిటెడ్ సిఇఒ గేదెల శ్రీనుబాబు నేతృత్వంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ, ఐటి రంగంలో హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో విశాఖ పోటీపడుతోందని చెప్పారు. వచ్చే ఏడాది కాలంలో విశాఖ నగరానికి పలు ఐటి దిగ్గజ కంపెనీలు రాబోతున్నాయని వివరించారు. విశాఖను బీచ్ ఐటి డెస్టినీగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించుకుని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటి కంపెనీలకు తెలియజేసే ఉద్దేశంతోనే జనవరి నుంచి ఏప్రిల్ వరకు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులతోపాటు గ్లోబల్ టెక్ సదస్సును విశాఖలో నిర్వహిస్తున్నామని చెప్పారు. జనవరి 6, 7, 8 తేదీలలో విశాఖలో హెల్త్ సమ్మిట్, 20,21 తేదీలలో ఇన్ఫినిటీ వైజాగ్ ఐటీ సదస్సు, ఫిబ్రవరి 3, 4 తేదీలలో జి20 సదస్సు, మార్చి 3, 4 తేదీలలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు, ఏప్రిల్ 24న జి-20 సమావేశాలు విశాఖలోనే నిర్వహిస్తున్నామని, వీటి వల్ల విశాఖ నగరం అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందని చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు, గ్లోబల్ టెక్ సమ్మిట్ ద్వారా పెద్ద ఎత్తున ఐటి పరిశ్రమలు, భారీ పరిశ్రమలు విశాఖకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఒకటి, రెండు నెలల్లో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, అమెజాన్ త్వరలోనే విశాఖలో అడుగుపెట్టబోతుందని చెప్పారు. ఐబిఎంను కూడా విశాఖ తీసుకొచ్చేందుకు చర్చలు జరుపుతున్నామని వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

పల్సస్ గ్రూప్ లిమిటెడ్ సీఈవో గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ, గ్లోబల్ టెక్ సమిట్‌కు సుమారు 1000 మంది ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ సమ్మిట్‌కు సంబంధించి ఇప్పటికే భువనేశ్వర్, ఢిల్లీ, హైదరాబాద్‌లో రోడ్ షోలు నిర్వహించామని తెలిపారు. జి 20 దేశాలలో కూడా ఈ సదస్సు ప్రాధాన్యత వివరించి ఐటి రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలను సదస్సుకు ఆహ్వానించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్స్ సొసైటీ సిఇఒ అనీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించం

-డిఇఒ లింగేశ్వరరెడ్డి -25 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీస్‌లు

ప్రజాశక్తి -నక్కపల్లి :ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించే లేదని జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఫిజిక్స్ సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులకు పాఠ్య బోధన చేసి, పలు ప్రశ్నలను వేశారు. పాఠ్య ప్రణాళికలు, చైల్డ్ వైస్ ఎనాలసిస్, విద్యార్థుల గ్రేడింగులు, ఎఫ్ఏవన్, ఎఫ్ఏ టు మధ్య విద్యార్థుల ప్రగతి తదితర అంశాలను క్షుణంగా పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి 25 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసును జారీ చేశారు. పక్కా ప్రణాళికతో 10వ తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డివిడి ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

భూములు దోచుకోవడానికే డ్రోన్ సర్వే

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-గొలుగొండ:వైసిపి ప్రభుత్వం డ్రోన్ సర్వే ద్వారా ఎక్కడ భూములు ఖాళీగా ఉన్నాయో తెలుసుకుని వాటిని దోచుకోవడానికి ప్రయత్నాలు చేస్తుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. బుధవారం గొలుగొండ మండలం కొత్తజోగుంపేట గ్రామంలో గొలుగొండ మండలం తెలుగు యువత ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్ల వెనక్కి పోయిందన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్, గొలుగొండ మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్రీ నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

టిడ్కో లబ్ధిదారులకు రుణమాఫీ ఏదీ?

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులు కట్టవలసిన బ్యాంక్ రుణాన్ని మాఫీ చేస్తామన్న సిఎం జగన్ ఇచ్చిన హామీ ఏమైందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టిడ్కో ఇళ్ల బ్యాంక్ రుణ మొత్తాన్ని మాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని ఇంత వరకు నెర వేర్చలేదన్నారు. అధికారంలోకి వస్తే రుణాన్ని కట్టవద్దని చెబితే ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపిస్తే మోసం చేశారన్నారు. టిడ్కో ఇళ్లలో ఎటువంటి సదుపాయాలు లేవని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం టిడ్కో ఇళ్ల బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలన్నారు. ఇల్లు అప్పగిచక పోయినా రుణాలు కట్టడానికి లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాము ఈ సమస్యపై అడిగితే కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారన్నారు. దీనిపై నర్సీపట్నం వస్తున్న సీఎంను టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు గట్టిగా ప్రశ్నించాలని సూచించారు.

శరవేగంగా ఇంటింటా కుళాయి పనులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో తట్టబంద గ్రామ పంచాయతీలో ఇంటింటి కుళాయిల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సర్పంచ్ గోకవాడ రమణ పర్యవేక్షణలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటి కుళాయి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ఇచ్చే విధంగా పనులు చేపడుతున్నామన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ ఒకటే అన్న విధంగా పని చేయడం జరుగుతుందని, ప్రభుత్వం నుంచి అందించే ప్రతి పథకాన్ని అర్హులైన వారందరికీ అందజేస్తామని ఆయన తెలిపారు.



చేపడుతున్న పనులు